ఎన్నికల ఖర్చు లెక్కలు వెంటనే ఇవ్వండి



సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చు వివరాలను రీకన్సిలేషన్ చేసి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సమర్పించడం జరుగుతుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు నియమించబడిన కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు ప్రేమ్ ప్రకాష్ మీనా, నాగ్వీ బలాసాహెబ్ బాపురావు అన్నారు. శుక్రవారం జిల్లా సహకార అధికారి, జిల్లా ఎన్నికల వ్యయ నోడల్ అధికారి ఆర్.శ్రీనివాస మూర్తితో కలిసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ప్రతినిధులతో సమావేశమై ఎన్నికల ఖర్చుల వివరాలను పరిశీలించారు. అభ్యర్థులు ఎన్నికల వ్యయాన్ని వారు నామినేషన్ వేసిన నాటి నుంచి ఎన్నికల ఫలితాలు ప్రకటించిన వరకు చేసిన ఖర్చు వివరాలను 30 రోజుల్లో సమర్పించాలన్నారు. ఈ వివరాలను మరోమారు పరిశీలించి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు తమ పూర్తి ఖర్చుల వివరాలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల అసిస్టెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు నాగేశ్వరరావు, శ్రీనివాస్ రాజు, ఆంజనేయులు, రామచంద్ర, రవి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల కేలండర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

మేడ్చల్: ఎన్డీఏ ప్రభుత్వం తొమ్మిదిన్నర ఏళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలతో రూపొందించిన కేలండర్‌ను బీజేపీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా బండమాదారం, డబీల్‌పూర్ గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో నాయకులు పాల్గొని వాల్ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, సర్పంచ్ గీత భాగ్యారెడ్డి, బీజేపీ నాయకులు మోహన్‌రెడ్డి, జగన్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, పోచయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు



సీసీ పనులను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, కమిషనర్ సాబేర్ అలీ

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ ఏడో వార్డులో రూ.5 లక్షల సాధారణ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను చైర్‌పర్సన్ పావనీజంగయ్య, కమిషనర్ సాబేర్ అలీతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవసరమైన చోట ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నర్సింగ్‌రావు, నాగజ్యోతి, నాయకులు జంగయ్యయాదవ్, నర్సింగ్‌రావు, కెఫా పాల్గొన్నారు.

అథ్లెట్లకు క్రీడా దుస్తుల పంపిణీ



జిల్లా మాస్టర్ అథ్లెట్‌లకు క్రీడా దుస్తులను అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: 30, 31 తేదీల్లో గచ్చిబౌలిలో నిర్వహించనున్న 10వ మాస్టర్ అథ్లెటిక్ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మాస్టర్ అథ్లెట్లకు క్రీడాదుస్తులను మేడ్చల్–మల్కాజిగిరి మాస్టర్ అథ్లెట్ అసోషియేషన్ అధ్యక్షులు మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి శుక్రవారం బోయిన్‌పల్లి ఉన్న క్యాంపు కార్యాలయంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెట్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు అంజిరెడ్డి, పాట్రన్‌లు రాజేందర్, చిరంజీవిరెడ్డి, సి.మల్లారెడ్డి, సెక్రటరీలు డాక్టర్ రత్నకుమార్, ట్రెజరర్ శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

సాయిగీత ఆశ్రమంలో అష్టలక్ష్మీ యజ్ఞం



మేడ్చల్: కండ్లకోయలోని సాయిగీత ఆశ్రమంలో ప్రతి సంవత్సరం చివరి ఆదివారం నిర్వహించే సర్వ దోష నివారణ యజ్ఞంలో భాగంగా శుక్రవారం ఆశ్రమంలో అష్టలక్ష్మీ యజ్ఞం నిర్వహించారు. భక్తులు, ఆశ్రమ నిర్వాహకులు యజ్ఞాలు చేశారు. శ్రీకీర్తిమా నేతృత్వంలో పూజలను ఘనంగా నిర్వహించారు. శనివారం ఆంజనేయ సహిత శని శాంతి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విజన్ కళాశాల విద్యార్థికి కబడ్డీ నేషనల్ టీంలో చోటు




నందిని అభినందిస్తున్న విజన్ కళాశాల యాజమాన్యం

మేడిపల్లి: జాతీయ స్థాయి బాలికల కబడ్డీ జట్టులో పీర్జాదిగూడ విజన్ కళాశాల విద్యార్థిని నందిని చోటు దక్కించుకుంది. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విజన్ కళాశాలలో ఇంటర్(ఎంపీసీ) ద్వితీయ సంవత్సరం చదువుతున్న వెంకటపూర్‌కు చెందిన అందె నందిని అండర్–17 బాలికల జాతీయ జట్టుకు ఎంపిక కావడంపై ఆ విద్యాసంస్థ కరస్పాండెంట్ భావన, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దానయ్య, రమాకాంత్, పీఇటి మెట్టు మహేష్ యాదవ్‌తో పాటు పలువురు అధ్యాపకులు ఆమెను అభినందించారు.

మల్కాజిగిరిపై అన్ని పార్టీల నజర్

అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లపై విశ్లేషణ



- లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు
- వ్యూహ రచనలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ

సాక్షి, మేడ్చల్ జిల్లా: దేశంలో అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గంగా పేరొందిన మల్కాజిగిరిపై అన్ని ప్రార్టీలు ప్రధాన దృష్టి సారిస్తున్నాయి. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సమాయత్తం అవుతుండగా, ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నాయి. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్.. ఎంపీ ఎన్నికల్లోనూ పైచేయి సాధించేందుకు ఇటీవల లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జులను నియమించింది. అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ మరింత ఓట్ల శాతం పెంచుకోవడంపై దృష్టి పెట్టింది. మరోవైపు బీజేపీ బలం పెంచుకునేందుకు తీవ్రంగా ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ స్థానమైన మల్కాజిగిరిలో విజయం లక్ష్యంగా వ్యూహ రచన చేస్తుండగా, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో గెలుపొందిన ధీమాతో ముందడుగు వేస్తోంది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చరిష్మాతో గెలుపు సాధించాలన్న పట్టుదలతో బీజేపీ ప్రజల వద్దకు వెళ్తోంది.

మల్కాజిగిరిది 3 జిల్లాల పరిధి..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం ఒక్కటే ఉంది. ఇక్కడి నుంచి గెలుపొందిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో లోక్‌సభ స్థానానికి రాజీనామా చేశారు. దీనికి తోడు పార్లమెంట్ ఎన్నికలు దగ్గరపడటంతో.. మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానంపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు గెలుపు యోచనతో వ్యూహాలకు పదును పెడుతూ.. బరిలో నిలిపే అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తోంది. మల్కాజిగిరి ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ గెలుపు కోసం ప్రచారం చేసి అధికారంలోకి తీసుకొచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి తన సిట్టింగ్ స్థానంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పార్లమెంట్ పరిధిలోకి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ అసెంబ్లీ స్థానాలు, రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎల్బీనగర్ నియోజకవర్గం, హైదరాబాద్ జిల్లాలోని కంటోన్మెంట్ నియోజకవర్గం ఉంది.

ఏడు నియోజకవర్గాల్లోనూ..

2018 అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు స్థానాలకు గానూ ఆరింటిలో బీఆర్ఎస్ విజయం సాధించగా, ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ నుంచి గెలిచిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. అయినా ఇక్కడి నుంచి ఎంపీగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన రేవంత్‌రెడ్డి విజయం సాధించారు. ఈ పార్లమెంట్ సెగ్మెంట్‌లో ప్రస్తుతం కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ బలంగా ఉన్నట్టు.. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీ బోణి కొట్టకపోవడమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. అయితే.. గత లోక్‌సభ ఎన్నికల్లో ఈ స్థానంలో ఆశించినంత మేర ఓట్లు సాధించలేకపోయిన బీజేపీ ఈసారి బలాన్ని పెంచుకోవడం ద్వారా 'మల్కాజిగిరి'పై సీరియస్‌గా వర్క్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

అసెంబ్లీ ఫలితాలు బేరీజు

మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఏడింటిలోనూ బీఆర్ఎస్ గెలుపొందింది. అయితే.. ఎల్బీనగర్, కుత్బుల్లాపూర్ నియోజవర్గాల్లో బీజేపీ రెండో స్థానంలో ఉండగా, మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ రెండో స్థానంలో ఉంది. ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పైచేయి సాధించినప్పటికీ, రాష్ట్రంలో అధికారం రోల్పోవడం వంటి అంశాలు ఎటువైపునకు దారి తీస్తాయోనని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. 'మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం సిట్టింగ్ కావడంతో కాంగ్రెస్ పార్టీ దూకుడుగానే కనిపిస్తోంది. ఈ స్థానానికి పార్టీ ఇన్‌చార్జిగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కాంగ్రెస్ అధిష్టానం నియమించడంతో మరింత జోష్‌తో ముందుకెళ్తోంది.

(2023) అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల వారీగా ఓట్ల వివరాలు

నియోజకవర్గం	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ
మేడ్చల్	1,86,017	1,52,598	50,535
మల్కాజిగిరి	1,24,683	74,872	55090
కుత్బుల్లాపూర్	1,87,999	1,02423	1,01,554
కూకట్‌పల్లి	1,35,635	65,248	39,830(జనసేన)
ఉప్పల్	1,32,433	83,004	46,976
ఎల్బీనగర్	1,11,380	83,273	89,075
కంటోన్మెంట్	59,057	20,825	41,888

2019 లోక్‌సభ ఎన్నికలలో పార్టీల వారీగా ఓట్ల వివరాలు

నియోజకవర్గం	కాంగ్రెస్	టీఆర్ఎస్	బీజేపీ
మేడ్చల్	1,22,199	1,30,286	36,572
మల్కాజిగిరి	81,875	72,034	54,449
కుత్బుల్లాపూర్	1,07,144	1,15,918	41,038
కూకట్‌పల్లి	73, 770	79,312	36,730
ఉప్పల్	85,385	77,501	46,143
ఎల్బీనగర్	97,858	70,454	53691
కంటోన్మెంట్	34,676	46,980	35,228

అభ్యర్థుల ఎంపికపై కసరత్తు

రాబోయే ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో పోటీ చేసేందుకు ప్రధాన పార్టీ నుంచి పలువురు నేతలు ఆసక్తి కనబరుస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన వారితో పాటు కొత్త వారు కూడా బరిలో నిలిచేందుకు ముందుకొస్తున్నారు. బీజేపీ నుంచి ఆ పార్టీ జాతీయ కార్యదర్శి మురళీధరరావు, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌తో పాటు మరికొందరు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డితో పాటు మరికొంత మంది నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ నుంచి గత పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన మర్రి రాజశేఖర్‌రెడ్డి మల్కాజిగిరి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆ పార్టీ నుంచి ఎవరు పోటీలో ఉంటారనేది ఆసక్తిగా మారినా.. బయటి నుంచి ఎవ్వరైనా దిగుమతి చేయవచ్చనే ప్రచారం జోరుగా సాగుతోంది.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



కాంగ్రెస్‌లో చేరుతున్న పర్వత్‌రెడ్డి

కీసర: కాంగ్రెస్ పార్టీతో ఉంటే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి అన్నారు. గోధుమకుంట గ్రామంలో బీఆర్ఎస్ కీసర మండల ఉపాధ్యక్షుడు వంగేటి పర్వత్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ అనితా శ్రీనివాస్‌తో పాటు సుమారు 200 మంది శుక్రవారం కాంగ్రెస్‌లో చేరే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, సీనియన్ నేత నక్క ప్రభాకర్‌గౌడ్, కీసర మండల అధ్యక్షుడు కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కిరణ్ జ్యోతి ప్రవీణ్, నాయకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభలకు స్పందన

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో అధికారులు నిర్వహిస్తున్న వార్డు సభలకు స్పందన లభిస్తోంది. కమిషనర్ రాములు, మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సభలు నిర్వహిస్తూ ప్రజలకు పత్రాలను అందజేశారు. కండ్లకోయలో కౌన్సిలర్ హసంరాజిగౌడ్ బండ్లబాటలను రహదారులుగా మార్చాలని దరఖాస్తు చేయగా, సుతారిగూడలో 4 నెలల నుంచి గ్రామానికి గోదావరి నీళ్ల రావడం లేదని కాంగ్రెస్ నాయకుడు మల్లేష్ ఫిర్యాదు చేశారు.



కండ్లకోయలో ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్

ఆలయం ఎదుట మూత్రశాలలు నిర్మించొద్దు

మేడ్చల్: కండ్లకోయలో ముత్యాలమ్మ ఇంటి ముందు నిర్మించనున్న మూత్రశాలలను వెంటనే నిలిపివేయాలని గ్రామ మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి కోరారు. తాను సర్పంచ్‌గా ఉన్న సమయంలో ముతాలమ్మగుడి నిర్మించి గుడి ఎదుట ఖాళీ స్థలాన్ని భక్తుల సౌకర్యార్థం వదిలిపెట్టామని తెలిపారు. ఆ స్థలంలో మున్సిపల్ అధికారులు మూత్రశాలలు నిర్మించాలని ప్రతిపాదనలు చేశారని, దాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

త్వరగా రోడ్డు మరమ్మతులు చేపట్టండి



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో తొమ్మిదో వార్డులో చేపట్టిన సీసీ రోడ్డు మరమ్మతులను త్వరగా పూర్తి చేయించాలని స్థానికులు శివరాత్రి సురేశ్, బర్ల సహదేవ్ ముదిరాజ్ వార్డు ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మూడు నెలల క్రితం పైపులైన్ పనుల కోసం రోడ్డును పగులగొట్టారని లేఖలో తెలిపారు. ప్రమాదాలు జరుగుతున్నాయని, త్వరగా పనులు పూర్తి చేయించి వార్డు ప్రజలకు అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాల వైపు సాగాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లయన్ గంప నాగేశ్వర్‌రావు

జవహర్‌నగర్: విద్యార్థులు బాల్యం నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ఉన్నతంగా ఎదగాలని లయన్ గంప నాగేశ్వర్‌రావు అన్నారు. క్రాంతి కీన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న సైనిక్, నవోదయ విద్యార్థులకు పోటీ పరీక్షల్లో పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా లయన్ గంప నాగేశ్వర్‌రావు, క్రాంతి కీన్ అకాడమీ ప్రెసిడెంట్, హైదరాబాద్–320 హెచ్ లయన్స్ క్లబ్ గవర్నర్ ఎస్.మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు పోటీ పడేలా చదవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే విషయాలను విద్యార్థులు ఏకాగ్రతతో అర్థం చేసుకోవాలన్నారు. అనంతరం కార్యక్రమంలో విశ్వేశ్వర్‌రావు, క్రాంతి కీన్ డైరెక్టర్ లావణ్య, ప్రిన్సిపల్ కళ్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు

ప్రభుత్వ పథకాలు అందజేసేందుకే ప్రజాపాలన

మేడ్చల్ కలెక్టర్ గౌతమ్



గౌడవెల్లిలో గ్రామసభను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్: ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు ప్రజలకు అందజేసేందుకు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ అన్నారు. దరఖాస్తు ఫారాల పంపిణీని పట్టణంలోని 7, 23వ వార్డులు, మండలంలోని గౌడవెల్లి గ్రామంలో ఆయన అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులకు ప్రజాపాలన ఆరు గ్యారంటీ ఫలాలను అందించేందుకు గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల వారిగా పూర్తిస్థాయి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దేవసహాయం, డీపీఓ రమణమూర్తి, ఎంపీడీఓ పద్మావతి, తహసీల్దార్ శైలజ, కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం

ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అధికారంలోకి రాగానే అమలు చేసేందుకు ప్రజాపాలన పేరుతో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ నేత తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. మండలంలోని పూడూర్ గ్రామంలో వారు పర్యటించి గ్రామసభలో పాల్గొని అభయహస్తం ఫారాలను దరఖాస్తుదారులకు అందజేసి ప్రజా స్పందనను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మాటను ఏనాడూ మరువలేదని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రజలకు ప్రభుత్వానికి కాంగ్రెస్ నాయకులు అనుసంధానంగా ఉంటూ పని చేస్తారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబు యాదవ్, అధికారులు కాంగ్రెస్ నాయకులు మల్లారెడ్డి అధికారులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: కమిషనర్ రామలింగం

జవహర్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ రామలింగం అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో ప్రజాపాలన కేంద్రాలను శుక్రవారం కమిషనర్ రామలింగం, మేయర్ కావ్య పరిశీలించారు. కార్పొరేషన్ పరిధిలో 6,428 దరఖాస్తులు స్వీకరించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలనను పరిశీలించిన కమిషనర్

ఘట్‌కేసర్: ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని మున్సిపాలిటీలో కమిషనర్ సాబేర్ అలీ, కౌన్సిలర్ సంగీతతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్‌సీనగర్‌లో దరఖాస్తు విధానంపై అవగాహన కల్పించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, ఆశ వర్కర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పూడూర్ సభలో వజ్రేష్ యాదవ్



జవహర్‌నగర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న కార్పొరేటర్ పల్లపు రవి



ఎన్ఎఫ్‌సీనగర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్ సాబేర్ అలీ, కౌన్సిలర్ సంగీత

ఉప్పల్‌లో భారీగా గంజాయి పట్టివేత



గంజాయిని చూపిస్తున్న ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు

ఉప్పల్: ఉప్పల్‌లో శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. నిందితుల నుంచి దాదాపు 32 కిలోల పొడి గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించిన ఘటన ఉప్పల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అశోక్‌నగర్ రైల్వే స్టేషన్ వద్ద ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం మాటువేసి ఉన్నారు. ఆగిఉన్న రైలు నుంచి ఓ వ్యక్తి ఐదు మూటలను రైలు నుంచి కిందిపడేసి అతడు దిగాడు. బ్యాగులతో బయటకు వస్తున్న సమయంలో పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన కిషోర్ నామ్‌దేవ్(23) అని పలాసా శ్రీకాకుళం నుంచి గుర్తు తెలియని వ్యక్తి వద్ద ఖరీదు చేసి తీసుకువస్తున్నట్లు అంగీకరించాడు. అతడి వద్ద ఉన్న 32 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఉప్పల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. అధికారులు ఎస్‌కే లతీఫ్, భరత్‌భూషన్, ఎండీ అబ్దుల్ జబ్బార్, మురళి పాల్గొన్నారు.

నేడు ఉప్పల్‌లోని ఐ ఫోకస్ 18వ వార్షికోత్సవం

ఉప్పల్: ఉప్పల్‌లోని ఐ ఫోకస్ మిషన్ సామాజిక సాంస్కృతిక నైపుణ్య సంస్థ 18వ వార్షికోత్సవం శనివారం సాయంత్రం ఉప్పల్ బగాయత్‌లోని తన కార్యాలయంలో జరుపుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి పలువురు రాష్ట్ర మంత్రులు, మాజీ మంత్రులు హాజరవుతున్నట్లు ప్రకటించారు.